క్లుప్తంగా

దసరా ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

దెందులూరు: గోపన్నపాలెం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల పోస్టర్లను ఆలయ కమిటీ గురువారం విడుదల చేశారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఉంగుటూరు: ఈ నెల 19వ తేదీ శుక్రవారం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పునులూరి ప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. నితిన్ యలమంచిలి మెమోరియల్ ట్రస్టు సహకారంతో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో విజయవాడ, హైదరాబాద్‌ల నుంచి వైద్యులు సేవలు అందజేస్తున్నారని ప్రకాష్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న ఉచిత చర్మవ్యాధుల శిబిరం

దెందులూరు: ఏషియన్ వాస్కులర్ హైదరాబాద్ వైద్యులు విజయ స్కిన్ హాస్పిటల్ డాక్టర్ సుబ్బారావు, ఏలూరు కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 21న కొవ్వలి మొట్టపర్తి భవన్‌లో మెలికలు తిరిగిన నరాలు, పాదం కాళ్లలో నలుపు పుండ్లు రావడం ఉబ్బిన నరాలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు వేంగి జేమ్స్ లయన్స్ క్లబ్ ప్రతినిధి వడ్లపట్ల శ్రీనివాస్ అన్నారు. వైద్య శిబిరంలో చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ సుబ్బారావు పాల్గొంటారన్నారు.

పారిశుద్ధ్యం పరిశీలన



పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న సీఈవో శ్రీహరి

ఉంగుటూరు: మండలంలోని బొమ్మిడి గ్రామాన్ని ఏలూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్యదర్శి, నిర్వహణ అధికారి ఎం.శ్రీహరి గురువారం ఉదయం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓతో పాటు డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, బొమ్మిడి కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కైకరం ఆర్‌వోబీకి మార్కింగ్



ఆర్‌వోబీకి సర్వే చేస్తున్న అధికారులు

ఉంగుటూరు: కైకరం ఆర్‌వోబీకి మార్కింగ్ పనులు గురువారం ప్రారంభించారు. జాతీయ రహదారికి తూర్పు వైపు ఉన్న నివాసితులు, పొలాల వారు తొలగించాల్సి ఉంటుంది. సెంటర్ నుంచి తూర్పు, పడమర వైపు 14 మీటర్లు తీసుకోనున్నారు. మండల సర్వేయర్ విశ్వనాథం, గ్రామ సర్వేయర్లు, రైల్వే సర్వేయర్లు పాల్గొన్నారు. తహసీల్దార్ పూర్ణ చంద్ర ప్రసాద్ పర్యవేక్షించారు.

వంతెన నిర్మించాకే గేటు మూసి వేస్తాం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

భీమడోలు: ప్రజాభీష్టం మేరకు భీమడోలు రైల్వే వంతెన నిర్మాణ పనులు జరుగుతాయని, ప్రజలు ఆందోళన చెందొద్దని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం భీమడోలు రైల్వే గేటు ఎల్‌సీ నంబర్ 361 మూసివేతపై ప్రజాభిప్రాయ సేకరణపై గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభకు కార్యదర్శి కేవీఎల్ తనూజ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ బి.రమాదేవి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, ఎఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్, ప్రత్తి మదన్, పైడిమాల యుగంధర్, రామిశెట్టి గోపి, శైలేంద్ర, ఆదిరెడ్డి సత్యనారాయణ, యడ్ల రమేష్, వీఆర్వోలు వినయ్, వీరప్రతాప్ పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష!

- విద్యుత్‌తో తస్మాత్ జాగ్రత్త
- వానాకాలంలో పొంచి ఉన్న ప్రమాదాలు
- ఆదమరిస్తే అంతే సంగతులు



భీమడోలులో ప్రధాన విద్యుత్ స్టేషన్

భీమడోలు: వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉండే కాలం. ఏ మాత్రం ఆదమరిచినా దాని ఫలితం తీవ్రంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్‌లో ప్రజలు, రైతులు విద్యుత్ భద్రతా నియమాలను పాటించాలి. దీనికి తోడుగా తుఫాన్ హెచ్చరికలతో కురిసే భారీ వర్షాలతో మరింత ప్రమాదాలు సంభవిస్తాయి. వానాకాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపోతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలిపోతాయి. వీటిని నిర్లక్ష్యం చేస్తే విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. అందుకే ఈ సీజన్‌లో రైతులు, ప్రజలు విద్యుత్ వినియోగంతో జాగ్రత్తలను పాటించాల్సిందే. బోర్ల కింద, కాలువల కింద మోటార్లతో సాగు చేసే రైతాంగం మరింత అప్రమత్తంగా ఉండాలి. అల్ప పీడన ప్రభావంతో మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అనుమతి లేని వ్యక్తులు ఎటువంటి ఫ్యూజులు వేయరాదని, వీధి దీపాలు మార్చడం వంటివి చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యలో ఉంటాయి. వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు మైనర్ మరమ్మతులు చేపట్టే సమయంలో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

చేయకూడని పనులు



గుబురుగా ఉన్న చెట్లను తాకుతూ వెళుతున్న వైర్లు (ఫైల్)

- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవడం.
- నీటిలో పడిన విద్యుత్ వైర్ల జోలికి వెళ్లడం.
- భవన నిర్మాణ కార్మికులు పనులు చేసే సమయంలో విద్యుత్ వైర్లను తాకడం.



భీమడోలు సంతమార్కెట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

- తడి చేతులతో, తడి బట్టలతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవడం, మరమ్మతులు చేయడం.
- పిల్లలకు అందే ఎత్తులో స్విచ్ బోర్డులను ఉంచడం.
- సొంతంగా ఇంటికి వైరింగ్ చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త వేయడం.
- టీవీ, కేబుల్ వైర్లపై బట్టలు ఆరేయడం.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటార్‌కు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి.
- మోటార్ పని చేయని సమయాల్లో చేతితో తాకకూడదు. టెస్టర్‌ను ఉపయోగించి మాత్రమే పరీక్షించాలి.
- మోటార్ వద్ద ఫ్యూజులు, ఇండికేటర్ బల్బులు, స్టార్టర్‌ను ఒక చెక్కపై బిగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇనుప డబ్బాలపై బిగించకూడదు.
- విద్యుత్ సరఫరా లోపం ఉంటే ఎలక్ట్రీషియన్‌తో మరమ్మతులు చేయించుకోవాలి.
- విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలుంటే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలి.

విద్యుత్ శాఖ సూచించిన జాగ్రత్తలను పాటించాలి

భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ వైర్లు గాని తడిసిన విద్యుత్ స్తంభాలు గాని తాకకూడదు. వీలైనంత వరకు ప్రతి ఒక్కరూ రబ్బరు చెప్పులను వాడాలి. వర్షాలు పడుతున్న సమయంలో టీవీలు, ఫ్రిజ్‌లు, కంప్యూటర్ల స్విచ్‌లు ఆఫ్ చేయాలి. లేని పక్షంలో వైర్లు షార్ట్ అయ్యే ప్రమాదం ఉంది. వ్యక్తిగత భద్రతతో పాటు ప్రాణం మరింత ముఖ్యం. విద్యుత్ సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే 1912కు గాని 9440902926కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. తక్షణమే సమస్యలను పరిష్కరిస్తాం.

–వి.శివాజీ, ఏఈ, విద్యుత్ శాఖ, భీమడోలు

పేదలకు వైద్యాన్ని దూరం చేస్తే ఉద్యమం

దెందులూరు: సమాజంలో పేద బడుగు, బలహీన, గిరిజన, దళిత మైనార్టీ వర్గాల ప్రజలకు వైద్యం దూరం చేస్తే ఉద్యమాన్ని ప్రారంభిస్తామని జై భీమ్‌రావు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గొల్ల నరేష్, మాల మహానాడు ఏలూరు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు. కొవ్వలిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకొస్తూ ఆరోగ్యశ్రీని ఏర్పాటు చేస్తే నేడు కూటమి ప్రభు త్వం వైద్యాన్ని పేదలకు దూరం చేసే చర్యలు ప్రారంభించిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదవేగి: పెదవేగి సెక్షన్ పరిధిలో గల భీమడోలు నుంచి వెళ్లే వేగివాడ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేగివాడ, తాళ్లగోకవరం సబ్‌స్టేషన్ పరిధిలో గల వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ ముందుగా అంటే తెల్లవారు జామున 3 నుంచి 10:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా రైతులకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమడోలు: భీమడోలు సెక్షన్‌లోని పూళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు నరకడం, అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పలు ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వి.శివాజీ తెలిపారు. గురువారం ఆయన ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పూళ్ల, అంబర్‌పేట, అన్నేవారిగూడెం, జి.కండ్రిక, వడ్లపట్ల ఫీడర్ల పరిధిలోని అంబర్‌పేట, అన్నేవారిగూడెం, వడ్లపట్ల గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

వట్లూరు అండర్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో?



నిర్మాణం పూర్తయిన ఆర్‌సీసీ బాక్సు సెగ్మెంట్



అండర్ బ్రిడ్జి స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

సాక్షి టాస్క్ ఫోర్స్: వట్లూరు రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వట్లూరు దక్షిణాదిన ఎల్‌సీ గేట్ నంబర్ 343 వద్ద ఆర్‌వోబీ–25 2018లో ప్రారంభమైందన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 11 కోట్ల అంచనాలతో రోడ్డు అండర్ బ్రిడ్జి ప్రాజెక్టును రూపొందించామన్నారు. రైల్వే అండర్ పాస్ నిర్మాణం కోసం రూ.4 కోట్లు మంజూరు చేయించానన్నారు. టెండర్లు పూర్తయ్యాయని రైల్వే విభాగం పనులు పూర్తయ్యి ప్రస్తుతం ఎల్సీ బ్లాక్ కోసం వేచి ఉన్నారన్నారు. మిగతా రూ.7 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని, రూ.6 కోట్లు అప్రోచ్ రోడ్లు, ఒక కోటి భూసేకరణ కోసం అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రూ.5 కోట్లు మంజూరైనట్లు చెబుతున్నారన్నారు. ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చాయా లేక గతంలోని రైల్వే మంజూరులో హాగమా అని ప్రశ్నించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన నిధులు స్పష్టంగా మంజూరు చేయాలని ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రాజెక్టు పూర్తి చేయడం అత్యవసరమని ఆయన అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారి మనోజ్ కుమార్‌తో ఈ విషయమే మాట్లాడానన్నారు. ఫిబ్రవరి 2024లో దెందులూరు–అలుగులగూడెం రైల్వే అండర్ పాస్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించామన్నారు.

మర్యాదపూర్వక కలయిక





వైఎస్సార్ సీపీ అధినేతను మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరితో తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజవర్గంలో పార్టీ నూతన కమిటీలు నియమించినందుకు వైఎస్ జగన్‌కు అబ్బయ్యచౌదరి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ అధినేతను కలిసిన నాగబాబు

పెదవేగి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో పెదవేగి మండలం బాపిరాజుగూడెం నేత వీరమాచినేని నాగబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్న వైఎస్ జగన్ పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. రాష్ట్రంలో నేతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గమనిస్తూనే ఉన్నానని పార్టీ ఎవరినీ వదిలేయదని ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారని చెప్పారు.



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన వీరమాచినేని నాగబాబు

పేద వైద్య విద్యార్థులకు కూటమి అన్యాయం

గణపవరం: రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్య, ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న చిత్తశుద్ధితో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో కష్టపడి 17 వైద్య కళాశాలలను తెచ్చారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. వాటిని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం పేద వైద్య విద్యార్థులపై వేటు వేయడమేనని ఆయన అన్నారు. గురువారం వాసుబాబు క్యాంపు కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ శుక్రవారం పార్టీ తలపెట్టిన చలో మెడికల్ కళాశాల ఆందోళనకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ వైఎస్ జగన్ హయాంలో కాలేజీల నిర్మాణం శరవేగంగా సాగిందని, కూటమి పాలన వచ్చాకే నిర్మాణ పనులు చతికలబడ్డాయని విమర్శించారు. ఇప్పటికే ఐదు కాలేజీలు పూర్తై, కొన్నింటిలో ద్వితీయ సంవత్సరం వైద్య విద్య తరగతులు జరుగుతున్నాయని, కొన్ని దాదాపు పూర్తి కావస్తుండగా, మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ విషయం మరుగున పెట్టి పచ్చమీడియాలో కాలేజీల నిర్మాణమే ప్రారంభంకాలేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టేలా వార్తలు ప్రచురించారన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ వాస్తవాలను ప్రజల ముందుంచాలని చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు మండలాల పార్టీ అధ్యక్షులు దండు రాము, సంకుసత్యకుమార్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ కోడే కాశీ, కమ్మిల భాస్కర్‌రాజు, సూర్యబలిజ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి రాజా, నియోజకవర్గ బూత్ విభాగం అధ్యక్షుడు దండు గోపీరాజు, జీవీ, కొట్టు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గణపవరం: చలో మెడికల్ కాలేజీ పోస్టర్లను విడుదల చేస్తున్న వాసుబాబు

నేడు ఏలూరులో చలో మెడికల్ కాలేజీ

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఏలూరులో చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలకు ఏలూరు పాత బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ కాలేజీ వద్ద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అబ్బయ్య చౌదరి కోరారు.

చలో మెడికల్ కాలేజ్ నిరసనకు తరలిరండి

భీమడోలు: ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు ఏలూరులో నిర్వహిస్తున్న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి విద్యార్థి, యువజన విభాగాల శ్రేణులు తరలి వచ్చి విజయవంతం చేయాలని భీమడోలు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్య శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు గురువారం కోరారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి పేద, మధ్యతరగతి వారికి వైద్య వృత్తిని దూరం చేస్తుందన్నారు. కూటమి కుతంత్రాలను ప్రతి ఒక్కరూ అడ్డుకునేందుకు తమ నిరసన ద్వారా తెలియజేయాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

గణపవరం: ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని, ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలు సాధించే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుప్పాల ప్రకాశరావు అన్నారు. గురువారం గణపవరం మండలంలో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపధ్యాయులనుద్దేశించి నాయకులు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేయాలని, డిమాండ్స్ సాధనకు అన్ని ఉపాధ్యాయుల సంఘాలు కలిసికట్టుగా ఉద్యమించాలన్నారు. నేటి వరకూ ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావలసిన ఆర్థిక ప్రయోజనాలు దక్కకపోవడం దారుణమని, కనీసం నిర్ణీత కాలంలో ఇవ్వాల్సిన డీఏలు ఇవ్వడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇంతవరకూ ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. తమకు రావాల్సిన పీఎఫ్, ఏపీజీఎల్‌ఐ, సరెండర్ లీవుల సొమ్మును చెల్లించడం లేదన్నారు. వెంటనే బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా ఇంత వరకూ పీఆర్‌సీపై కమిటీని నియమించలేదని, వెంటనే నియమించాలన్నారు. సంఘాల పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాల్లో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు, కార్యదర్శి జి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

నారీ శక్తితో సమాజాభివృద్ధి



భీమడోలు: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



దెందులూరు: అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భీమడోలు: మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి యు.శోభ అన్నారు. పూళ్ల పీహెచ్‌సీ వద్ద గురువారం స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు పి.అరుణజ్యోతి, ప్రదీప్ ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఏలూరు విజయ ఆసుపత్రి జనరల్ ఎండీ మధుసూధనాచారి, సర్పంచ్ దాయం సుజాత, శరణాల మాలతీరాణి, ఎంపీహెచ్‌ఈవో లక్ష్మణరావు, హెచ్‌వీ జి.శ్రీనివాసరావు,మావుళ్లమ్మ, మూర్తి, ధర్మారావు, కృష్ణారావు, పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ రక్ష

ఉంగుటూరు: మహిళల బలమే కుటుంబానికి రక్ష అని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యులు శ్రావణరెడ్డి అన్నారు. గురువారం తల్లాపురంలో స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ నిర్వహించారు. సర్పంచి నర్సింహారావు, మాలతీరాణి, అడ పా శోభారాణి, సత్యనారాయణ, దుర్గారావు పాల్గొన్నారు.

అన్ని రకాల క్యాన్సర్ల గుర్తింపు

దెందులూరు: మహిళలు, బాలికల్లో అన్ని రకాల క్యాన్సర్ల గుర్తింపుకు కేంద్ర ప్రభుత్వం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ బొడ్డు మోహన్ అన్నారు. గురువారం పోతునూరు పీహెచ్‌సీలో వైద్యాధికారులు చైతన్య, శాంతకుమారి, సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్, హెచ్‌ఎస్ఆర్ కృష్ణమోహన్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎండీఎం సమన్వయ కర్త కృష్ణారావు

గణపవరం: మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాల విద్యార్థులు వినియోగించుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా సమన్వకర్త కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన గణపవరం మండలం పిప్పర ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వంటగది పరిసరాలను, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారమే వంట చేయాలని, నిర్దేశించిన నాణ్యత ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఎండీఎం రికార్డులు, స్టోర్ రూమ్‌లో గుడ్లు, చిక్కీలు, బియ్యం బస్తాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పీజే వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ బాలాజీ, సీఆర్‌పీ జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

ఉంగుటూరు: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ హనుమంతురావు, సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్లు, ఆలయ ఈవో కె.శ్రీనివాస్, సర్పంచ్ బి.సింధు తదితరులు పాల్గొన్నారు.